# ఎం. డి.

ఎం.డి. అంటే చాల అర్థాలున్నాయి. అందరికీ తెలిసింది మేనేజింగ్ డైరెక్టర్. 'మాష్టర్ ఆఫ్ డాక్టర్స్ అని కూడా వుందిగా' అంటాడు కామేశం.

'నీ మొఖం. మాష్టర్ ఆఫ్ డాక్టర్స్ కాదు. డాక్టర్ ఆఫ్ మెడిసిన్' అన్నాడు రామేశం.

'ఏదో ఒకటి. నువ్వు చెప్పు. నీ ఉద్దేశ్యంలో ఏమిటో... ' అన్నాడు గోపాళం.

చెబుతాను. ఇదేమీ ఒక హాస్య సందర్భమైన విషయం కాదు కనుక చెబుతాను. కొంచెం ఓపిక పట్టండి.

0 0 0

1950, 1960, 1970, 1980, కొంత వరకూ 1990 దశకాలలో అందర్నీ పగలబడి నవ్వించిన ఒక హాలీవుడ్ నటుడు వున్నాడు. హాస్యానికి ఒక కొత్త ఒరవడి పెట్టి హాస్య నటనకే భాష్యం వ్రాశాడు. అరవైలలో నేను కాలేజీలలో చదివేటప్పుడూ డెభైలలోనూ అతని సినిమాలు తెగ చూసేవాడిని. నట్టీ ప్రొఫెసర్, పార్డ్‌నర్స్, బెల్ బాయ్, గీషాబాయ్, ఇట్స్ ఎ మ్యాడ్ మ్యాడ్ మ్యాడ్ వరల్డ్, బోయింగ్ బోయింగ్, హూ ఈజ్ మైండింగ్ ది స్టోర్, ఫామిలీ జువల్స్ ఇలా చెప్పుకుంటూ పోతే, అతను వేసిన 63 సినిమాల్లో కనీసం అరవై సినిమాల పైన జనాల్ని కితకితలు పెట్టాయని చెప్పొచ్చు. అతనూ డీన్ మార్టిన్ కలిసి హాస్యం సంగీతం పండించారు. ఆనాటి మన తెలుగు హాస్య నటుడు పద్మనాభం కొన్ని సినిమాల్లో ఇతన్నే అనుకరించాడు. ఈ గొప్ప హాస్యనటుడికి వందల్లో వచ్చాయి నటనకీ, దర్శకత్వానికీ, రచనకీ పురస్కారాలూ, బహుమతులూ. ఈ సంవత్సరం అతనికి ఎంతో ప్రాముఖ్యం వున్న 'ఎమ్మీ' పురస్కారం కూడా ఇవ్వబోతున్నారు. అతనికి డెభై తొమ్మిది సంవత్సరాల వయసు ఇప్పుడు. అతని పేరు మీలో చాలమందికి తెలిసినదే జెర్రీ లూయిస్.

0 0 0

1980వ దశకంలో, ఆస్టిన్‌లోని ఒక కంప్యూటర్ కంపెనీలో ఇంజనీరింగ్ విభాగానికి మేనేజర్‌గా పని చేస్తుండేవాడిని. అప్పుడు రకరకాల సప్లయర్స్‌తో మాట్లాడుతుండేవాడిని. వాళ్ళల్లో నాకు ఒక స్నేహితుడని చెప్పుకోదగ్గ వాడు డెన్నిస్. ఆరడుగుల ఆరంగుళాల పొడుగున్న తెల్లతను. అతనికి భార్య, ఒక కూతురు. నాతో చాల కలుపుగోలుగా వుండేవాడు. అలా దాదాపు రెండేళ్ళు గడిచింది మా స్నేహం.

ఒకరోజు ప్రొద్దున్నే మామూలుగానే మా ఆఫీసుకి వచ్చాడు డెన్నిస్. బిజినెస్ వ్యవహారాలు మట్లాడుకున్న తర్వాత 'నీతో కొన్ని స్వంత విషయాలు చెప్పాలి. తలుపు దగ్గరకి వేయనా' అన్నాడు తలుపు దగ్గరికి వేస్తూ.

ఆశ్చర్యంగా చూశానతన్ని. 'నాకు కొన్నాళ్ళుగా ఆరోగ్యం బాగుండటం లేదు. నేను కొంచెం బరువు తగ్గటం చూసేవుంటావు' అన్నాడు.

అతన్ని దీక్షగా చూసి 'అవును. కానీ తగ్గటనికి మా అందరిలాగానే ప్రయత్నం చేస్తున్నావనుకున్నాను' అన్నాను.

డెన్నిస్ నా చేయి పట్టుకుని అన్నాడు 'నాకు వచ్చింది ఎఎల్ఎస్. ఇకనించీ రోజు రోజుకీ నా ఆరోగ్యం క్షీణించి పోతుంది. మామూలుగా నేను చేసుకునే పనులు కూడా చేసుకోలేక మంచం ఎక్కాల్సివస్తుంది. బహుశా ఇంకో రెండేళ్ళు బ్రతుకు తానేమో.... అందుకే మా పెన్సిల్వేనియాకి వెళ్ళిపోతున్నాం. నేను వెంటనే చేయాల్సిన పనులు చాల వున్నాయి'

నా నోట మాట రాలేదు. నాకో కౌగలింత ఇచ్చి కనుమరుగయాడు. తర్వాత సంవత్సరం దాటిందనుకుంటాను, ఇంకో మిత్రుడు కనపడి, డెన్నిస్ శాశ్వతంగా కనుమరుగయాడని చెప్పాడు.

0 0 0

ఎ.ఎల్.ఎస్. అంటే Amyotrophic lateral sclerosis. దీనికి Lou Gehrig's disease అనే పేరు కూడా వుంది. ఇదొక నరాల బలహీనతకి సంబంధించిన వ్యాధి. న్యూరాన్లు అనబడే నెర్వ్ సెల్స్ అయిచ్ఛికంగా పనిచేసే కండరాలు పని చేయటానికి ఉపయోగపడతాయి. న్యూరాన్లు దెబ్బ తినటం వల్ల వస్తుంది ఈ వ్యాధి. ఈ న్యూరాన్లు అయిచ్ఛిక కండరాలని బలహీనం చేసి, మెదడుకి అందుబాటులో లేకుండా చేస్తాయి. అంటే చేతులు, కాళ్ళు, శరీరంలోని భాగాలు ఒక్కొక్కటీ మెదడు చెప్పిన మాట వినక, చెప్పినట్టు పనిచేయటం మానేస్తాయి. దానితో వాటి కదలికలు ఒక్కొక్కటే కొంతమందిలో నెమ్మదిగానూ, కొంతమందిలో త్వరితంగానూ ఆగిపోతాయి. మరణానికి దారి తీస్తాయి. ఈ ఎ.ఎల్.ఎస్. వచ్చినవారు ఒక్క అమెరికాలోనే 30 వేల పైచిలుకు వున్నారు. ఏటేటా కనీసం ఐదు వేలమంది అమెరికన్‌లకి వస్తున్నదిట ఈ జబ్బు. ప్రపంచం మొత్తం మీద ఎన్నో లక్షలమందికి ఈ జబ్బు వున్నదనీ, అమెరికాలో జరుగుతున్న చికిత్స కానీ, రీసెర్చి కానీ ఇంకెక్కడా జరగటల్లేదనీ తెలుస్తున్నది. ఇలాటి న్యూరో మస్క్యులర్ రోగాలు చాల రకాలు వున్నాయి. కొన్ని పుట్టుకతో వచ్చేవయితే, కొన్ని పిల్లలలో రకరకాల కారణాలవల్ల వస్తుంటాయి. ఇలాటి మస్క్యులర్ రోగాలన్నిటినీ కలిపి వాడే మాట ఎం. డి. అంటే మస్క్యులర్ డిస్ట్రొఫీ. ఇది పుట్టుకతోనే వచ్చిన పిల్లలు ఎంతో బాధ పడుతున్నారు. బుద్ధిమాంద్యం కొందరికయితే, అతి నెమ్మదితనం, చేతులూ కాళ్ళకీ మిగతా శరీర భాగాలకీ కదలికలు లేకపోవటం, కొంతమంది చక్రాల కుర్చీలకే అంకితమయిపోవటం హృదయాలని కలిచివేస్తుంది. ఈ ఎం.డి.లో ఎంతో రీసెర్చి జరిగినా ఇంకా జరగవలసింది చాల వుంది. జీన్ థెరపీ చేయటానికి 'జీన్' సైజ్ 'మజిల్ సెల్' సైజ్ కన్నా ఎంతో పెద్దదవటం వల్ల, శాస్త్రజ్ఞులు చేద్దామనుకున్న పరిశోధనలు చేయటం ఇప్పటిదాక కష్టమయిపోతున్నదిట. యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌లో జీన్ సైజ్ తగ్గించటానికి చేసిన పరిశోధనా ఫలితాలు విజయవంతమైనాయనీ, ఇక ఈ రోగ నివారణ సులభమవుతుందనీ ఈ మధ్య

వచ్చిన వార్త. అలాగే ప్లాస్మా ఫొరోసిస్ అనే పద్ధతి. అంటే ఇమ్యూన్ సిస్టంలో రక్తశుద్ధి అన్నమాట. ఈ పరిశోధనలకన్నిటికీ ఎంతో డబ్బు కావాలి. అంతే కాదు. ఈ జబ్బు వచ్చిన పిల్లలకీ పెద్దలకీ థెరపీ, మందులూ, ఆపరేషన్లూ, చక్రాల కుర్చీలు మొదలైన వాటికి చాల ఖర్చవుతుంది. చాల అంటే ఎన్నో వందల మిలియన్ల డాలర్లు. మరి అవి ఎలా వస్తాయి?

ఎవరో ఒక మహానుభావుడు ముందుకు వచ్చి కావలసిన స్పందన నిచ్చి ఆ మహా యజ్ఞాన్ని ప్రారంభిస్తే డబ్బులు అవే వస్తాయి. తన సినిమాలతో అందరినీ నవ్వించిన జెర్రీ లూయిస్ ఈ ఎం.డి.తో బాధపడే వారి జీవితాల్లోనూ నవ్వులు పండించాలని గట్టిగా నిశ్చయించుకున్నాడు. అనుకుంటే చాలదు ఆచరణలో పెట్టాలి. అందుకే 1966లో న్యూయార్క్‌లో ఒక టీవీ స్టేషను సహాయంతో ధన సేకరణ మొదలుపెట్టాడు. ఆ సంవత్సరమే మిలియన్ డాలర్లు చందాల రూపంలో వసూలు చేశాడు. అంతటితో ఆగలేదు. సెప్టెంబర్‌లోని మొదటి సోమవారం అమెరికాలో లేబర్ డే కారణంగా శెలవు దినం. 1966నించీ ఈ రోజు దాకా, ప్రతి సంవత్సరం లేబర్ డే వారాంతంలో తను ప్రారంభించిన కార్యక్రమాన్ని, తనకి దాదాపు ఎనభై ఏళ్ళు వచ్చినా వదలకుండా నిర్వహిస్తున్నాడు. ఈ మేరథాన్ కనీసం పదహారునించీ పద్దెనిమిది గంటలు నిర్విరామంగా చేస్తారు. ఎన్నో వందల మంది వాలంటీర్లు. ఈనాడు 200 టీవీ స్టేషన్లు ఉచితంగా ఈ చందాల వసూలు కార్యక్రమాల్ని ప్రసారం చేస్తున్నాయి. ఒక్క అమెరికాలోనే కాదు. కొన్ని ఇతర దేశాల్లో కూడా. పోయిన సంవత్సరం కన్నా ఈ సంవత్సరం కనీసం ఒక్క డాలర్ అయినా ఎక్కువ వసూలు చేయాలి అనేది ఆయన లక్ష్యం. అలా ప్రతి సంవత్సరం కొన్ని మిలియన్ల డాలర్లు ఎం.డి.ఏ.కి (మస్క్యులర్ డిస్ట్రాఫీ అసోషియేషన్‌కి) సంపాదించి పెడుతున్నాడు. 2004లో 60 మిలియన్ల డాలర్లు వసూలు చేశారు. టీవీలో ఆ కార్యక్రమం చూస్తూ ఈ వ్యాసం వ్రాస్తున్నాను. కొన్ని కంపెనీలు అర మిలియన్ దగ్గరనించీ ఒక మిలియన్ దాకా ఇస్తున్నాయి. అవికాక సామాన్య ప్రజలు చేసే ఫోన్ కాల్స్. ఫోన్లు ఆగకుండా మ్రోగుతూనే వున్నాయి.

ఇలా జెర్రీ లూయిస్ సహాయం చేస్తున్న పిల్లలని 'జెర్రీస్ కిడ్స్' అంటారు. ఇంతకుముందు అలా సహాయం తీసుకున్న పిల్లలు నవ్వు ముఖాలతో అతని పక్కనే నుంచుని చందాలివ్వమని అర్థిస్తున్నారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క కథ చెబుతున్నారు. హృదయాలను కరిగించే కథలు. పిల్లల తల్లిదండ్రులు కొంతమంది ఆనంద భాష్పాలతో చెబుతుంటే, కొంతమంది కోల్పోయిన తమ పిల్లలకీ భర్తలకీ కన్నీటితో నీరాజనం ఇస్తూ తమ కథలు చెబుతున్నారు.

ఇలాటి కార్యక్రమాలే నిజమైన యజ్ఞాలు. మానవతా యజ్ఞాలు!

0 0 0